# నిజాయితీ నిద్రపోతోంది!

రచన : శ్రీ పేహరి సుబ్రహ్మణ్యం మూర్తి, బి.ఏ.



(రచయిత).

ఆనంద్ ఎంతో నిజాయితీతోనూ, నక్కచ్చిగానూ తన పని తాను సక్రమంగా చేసుకుంటూ పోయే చక్కని అధికారి. తను నాయకులతోగాని, అధికారులతోగాని మితంగా ప్రవర్తిస్తాడు. ఎవరితోను అధికంగా మాట్లాడ డంగాని, కాకాలుపట్టి గోరింతలు, కొండంతచేసి గొప్పలు పలకడమన్నా తనకుగిట్టవు. అతనికి అటువంటి పనులంటే చాలా తలనొప్పి.

ఇతరులకి బాధ కలిగించినా, తను మాత్రం ముక్కు సూటిగా, నీతి నిజాయితీలకు గీటు తగ్గకుండా పనిచేసు కొనిపోయే మన స్తత్వమున్న మనిషి. తన డ్యూటీలో ఎవర్ని లక్ష్యపెట్టని మనిషి. అంటే పై వాళ్ళను నిర్లక్ష్యంగా చూస్తాడని మాత్రం కాదు. 'వర్క్ ఈజ్ వర్‌షిప్' అనే సిద్ధాంతంతో మరొకరిని లక్ష్యపెట్టకుండా, రూల్సు ప్రకారం పనిచేసుకొని పోవడమే తన ప్రథమ లక్ష్యం. అలాగని మంచి, మర్యాదలు తెలియని మనిషి మాత్రము కాదు. అతని దగ్గరకు వెళ్ళిన వ్యక్తులతోను మర్యాదగాను, సవ్యంగాను సమాధానం చెప్పి పంపిస్తుంటాడు.

ఆనంద్ తన ఉద్యోగం మినిష్టరుగారి స్వగ్రామములో వున్న రెవెన్యూ ఆఫీసులో 'రెవెన్యూ' ఆఫీసరుగా పనిచేస్తు న్నాడు. ఆనంద్ తన డ్యూటీని, నీతి నిజాయితీలతో చేసి, మంత్రిగారి మెప్పు, మన్నన, గుర్తింపు సంపాదిస్తే భవి ష్యత్తులో తనకు మంచి రాణింపు లభిస్తుందని ఊహించి, ఆనంద్ ఆ పూతు కోరుకున్నాడు. అనుకున్నట్లుగానే ఆనంద్ అనతికాలంలోనే ఆఫీసులోను, తన అధికారుల దగ్గర బాగా పనిచేసే ఉద్యోగిగా ముద్ర సంపాదించాడు.

ఇలా అచ్చట ఆనంద్ కాలం గడుపుతూ వస్తున్నాడు. ఒకసారి ఆనంద్ దగ్గరకు, ఒక బిళ్ళ బంట్రోతు జీపులో వచ్చి, "సార్! మినిష్టరుగారు ఈ వూరు గెస్టు హౌస్‌లో కేంపువేసారు. తమర్ని అర్జంటుగా తీసుకొని రమ్మన్నారు సార్! మీతో పని వుందట!" అని వర్తమానం తీసు కొచ్చాడు ఆ బంట్రోతు.

హఠాత్తుగా వచ్చిన కబురుకు ఆనంద్ ఒక నిముషం తత్తరపడి, మంత్రి కబురుకు కారణ మేమిుంటుందోనని, ఎంత ఆలోచించినా సరియైన ఐడియా తట్టకపోవడంతో చివరకు బంట్రోతుని భోగట్టా చేసినా 'నాకేమీ తెలియదు సార్!' అనడంతో ఆనంద్, తన నిజాయితీకి ఈనాటికి గుర్తింపు లభిస్తుందని ఊహించుకుంటూ, వచ్చిన జీపులోనే గెస్టుహౌసుకు బయలుదేరాడు ఆనంద్!

ఆనంద్ ను గెస్టుహౌసు బయటవున్న కుర్చీలో కూర్చో మని, బంట్రోతు లోనికి వెళ్ళి మినిష్టరుగారితో కబురుచెప్పి అతన్ని లోనికి తీసుకొని వెళ్ళాడు.

మినిష్టరుగారు గెస్టుహౌసు గదిలోవున్న పాలుకుర్చీలో కూర్చొని లోనికి వచ్చిన ఆనంద్ వైపు ఒకసారి ఎగాదిగా చూసి, చిరునవ్వు నవ్వి, "మిష్టర్ ఆనంద్! మీగురించి నేను చాలా విన్నాను. మీరు చాలా జాగ్రత్తగా పనిచేసుకుంటూ పోతుంటారని. సరే! ఒక పని చేసిపెట్టాలని" అంటూ,

లోపలినుంచి ఆజ్ఞ చేయగానే వచ్చిన యిద్దరు పెద్దమనుషులను చూపించి, వీరు నాకు బాగా కావలసినవారు. గత ఎన్నికల్లో నా కెంతో పనిచేసారు. నా అవసరం యింత కాలానికి వాళ్ళకిప్పుడు వచ్చింది. వారికిప్పుడు తప్పక ప్రత్యుపకారం నేను చేయాలి. కాని దానికి మీ సహకారం కావాలి. వారిలో ఒకరిని చూపిస్తూ-

ఈయన పేరు రామానాయుడు. వీళ్ళ అబ్బాయి వెంకు నాయుడు. పది ప్యాసయ్యాడు. కులం బి.సి.గాని, యస్.సి. గాని కాదు వయస్సు 35 సం॥లు నిరుడే దాటాయి. [illegible]లో ఏవో ఇండస్ట్రిలో ఉద్యోగానికి ధరఖాస్తు చేస్తున్నాడు. కాని ఏం లాభం! వయస్సు దాటిపోయింది. 35 సం॥ లోపున వయస్సుండాలట. సర్టిఫికేటు ప్రకారం 35 సం॥లు దాటిపోయాయి. కాబట్టి 5 సం॥ తగ్గించి పుట్టిన తేదీ మార్చి సర్టిఫికేటు తీసుకొనివస్తే యితనికి ఉద్యోగం ఖాయం.

ఆ పుట్టిన తేదీ మార్చి, సర్టిఫికేటు యిచ్చే అధికారం మీకే వుందట! కాబట్టి మీరు పుట్టినతేదీ మార్చి, 35 సం॥ లోపున వుండే విధంగా మీరు సంతకంచేసి ఒక సర్టిఫికేటు యివ్వండి చాలు.

రెండవ ఆసామి వైపు చూపిస్తూ, ఇతని పేరు సత్యం నాయుడు. ఈ ఆసామీకూడా నాకు చాలా కావలసినవాడు. ఈ ఆసామీ సారా పాటలు పాడి, నష్టపోయి ప్రభుత్వానికి ప్రజలకు, బ్యాంకులకు చాలా అప్పులపాలయ్యాడు. నాకు ఎలక్షను సమయంలో ఆర్థికంగా చాలా సాయం చేసాడు కూడా. బాకీదారు యితనిపై కోర్టులో దావావేసారు. కాబట్టి యితని విషయంలోగూడా మీరు చేయు సహాయం మరొకటి వుంది. ఇతనికి ఆస్తుపాస్తులు ఏమీ లేనట్లుగా పాపర్టీ సర్టిఫికేటు ఒకటి కావాలి. ఆ సర్టిఫికేటుకూడా యిచ్చే అధికారం మీదేనట! (ఇతని పేరుమీద యిల్లు, పొలంకూడా వుంది.) కాబట్టి మీరు యీ యిద్దరికి డేట్ ఆఫ్ బర్తు సర్టిఫికెట్, పాపర్టీ సర్టిఫికెట్ మీ సంతకంచేసి యివ్వండి చాలు! మీకే మైనా జరిగితే నే చూసుకుంటా!

మినిష్టరుని కదా! అని రిక్వెస్టు ఆదేశం మిళితమైవున్న విధంలో అడిగారు.

మినిష్టరుగారి మాటలు విన్న ఆనంద్‌కు శరీరం చెమట పట్టి ఒకటి రెండు నిముషాలు శరీరం అంతా గగుర్పాటు పొందింది. మెల్లిగా తెప్పరిల్లి, శరీరం అదుపులోనికి తెచ్చుకొని, 'సార్! రూల్సుకు వ్యతిరేకంగావున్న యిటువంటి సర్టిఫికేట్లు ఇవ్వడం మంచిపనికాదు సార్! ఇది నాకు చాలా ప్రమాదం సార్!! నేను యిటువంటి పనిచేయలేను, నన్ను అన్యధా భావించకండి సార్! అని సమాధానం యిచ్చాడు ఆనంద్!

ఆ సమాధానం విన్న మంత్రిగారు అతనివైపు ఎగాదిగా చూసి, 'అందుకే గదయ్యా నేను స్వయంగా పిలిచి చెపుతున్నదీ, రూల్సు ప్రకారం చేయదగిన పని అయితే నేను స్వయంగా చెప్పవలసిన పనేముంది! నువ్వే చేస్తావ్! రూల్సుకు విరుద్ధంగాబట్టే, నేను స్వయంగా కలుగజేసుకొని చెపుతున్నా. నీమీద ఏ రిపోర్టు వచ్చినా మావద్దకే వస్తాయి. నేను చూసుకొంటానని చెపుతున్నాగా! మరి నీ యిష్టం అని కొంచెం విసుగ్గా మాట్లాడాడు మంత్రి.


TRADEMARK
Geneva
TIRUPUR 638602

Regd. No.
A 29259/80

మీ సంతృప్తికి....
మేము తయారిస్తున్న ప్రత్యేకమైన రకాలు !!

• మ్యూసిక్ ఫైన్
• జెనీవా ఫైన్
• పాయల్ ఫైన్
• కూల్ బెక్సా ఫైన్
• షోలె ఫైన్
• వైలెట్ ఫైన్

: తయారించువారు :

Phone : 22891
GENEVA KNITTERS Stans Road 1st Street, TIRUPUR-638 602

కాని ఆనంద్ మంత్రిగారివైపు ఒకసారి చూసి, తల నేలవైపు దించి. 'ఇటువంటి పని తప్ప మరోపని చెప్పండి సార్! చేసి సహకరిస్తాను. మీ కోరికకు విముఖత చూపించి నందుకు క్షమించండి సార్!' అంటూ ఆనంద్ గది బయటకి వచ్చేసాడు.

ఒక వారం గడిచింది. కలెక్టరాఫీసునుండి ఆనంద్‌కు ఒక కవరు చేరింది. వచ్చే 15వ తేదీన కలెక్టరుగారి ఇన్‌స్పెక్షను వున్నట్లు రికార్డ్సు రెడీ చేసుకొని సిద్ధంగా వుండవలసినదిగా ఆ కవరులోని సారాంశం.

ప్రోగ్రాం ప్రకారం 15 వ తేదీన కలెక్టరుగారు ఆఫీసు ఇన్‌స్పెక్షన్‌కు హాజరయ్యారు. రికార్డ్సు అన్నీ కలెక్టరుగారి ఇన్‌స్పెక్షన్‌కు రెడీగా అందుబాటులో వుంచారు.

కలెక్టరు రికార్డ్సు వెరిఫై చేస్తూ నిమిషమాగి, కలెక్టరుగారి పేడ్‌లోనుంచి ఒక ఫైలు తీసారు. ఆనంద్‌ని పిలిచి 'మిస్టర్ ఆనంద్! నీమీద పిటిషన్స్ వచ్చాయి. నువ్వుచాలా నిర్లక్ష్యంగాను, పక్షపాతంగాను పనిచేస్తున్నావని. అంతేగాకుండా కులాభిమానం ప్రాధాన్యంగా చూస్తుంటావని, యీ మధ్య నీ విచ్చిన యిండ్ల పట్టాలలో చాలా అవకతవకలు వున్నాయనిగూడా రిపోర్టులో వుంది. ఈ మధ్య నీ దగ్గరకు వస్తున్న ఆసామీలనుండి కులం సర్టిఫికెట్సుకు, ఆదాయం సర్టిఫికెట్సుకు చాలా మొత్తాలు సేకరిస్తున్నట్లు కూడా రిపోర్టులో వుంది. నీ దగ్గిరికి యిటీవల వచ్చిన యిద్దరు పెద్దమనుషులకు బర్త్ సర్టిఫికెటు. ఆదాయం సర్టిఫికెటు యివ్వడానికి కొంత మొత్తం అడిగినట్లు. వారు యివ్వలేనందుకు వారికి సర్టిఫికెట్లు యివ్వలేదన్నట్లు మరో పిటిషన్ వుంది. దానిమీద మంత్రిగారి 'బేడ్‌మార్క్సు' గూడా వ్రాసివుంది. ఇది చాలా సీరియస్ విషయం! ఏమిటి దీనికి నీ తాలూకు సంజాయిషీ? నీవు చాలా సక్రమంగా, పక్షపాతరహితంగా పనిచేస్తావని, నీమీద ఒక ఇంప్రెషన్ ఇప్పటివరకు వుంది. కానీ నీలో ఏమీ లోపం లేకుండా మంత్రిగారే ఈ పిటిషన్ మీద రిమార్క్సు రాయవలసిన ఖర్మ ఏమిటి? నీ సంగతి ఏం సంతృప్తికరంగాలేదు' అంటూ కలెక్టరుగారు సీరియస్‌గా మాట్లాడుతున్న సమయంలో మంత్రిగారు (యిదివరకు వచ్చిన పెద్దమనుషులతో) కలెక్టరుగార్ని కలుసుకోడానికి ఆనంద్ ఆఫీసులో ప్రవేశించారు.

కలెక్టరు మంత్రిగార్ని రిసీవ్ చేసుకొని, షేక్‌హేండ్ యిచ్చి, కూర్చోమని మంత్రివైపు చూసి, ఈ ఆఫీసులో రెవెన్యూ ఆఫీసర్ ఆనంద్ పని సంతృప్తిగా లేదు సార్! యిప్పటివరకు హానెస్టుగా పనిచేసినా ఈ మధ్య తన ధోరణి అక్రమమైన మార్గాలవైపు మరల్చుకొంటున్నట్లు అర్థమవుతుంది. ఈయనమీద చాలా పెటిషన్‌లుగూడా వస్తున్నాయి. చాలావర్కు నేను యిప్పటివరకు పట్టించుకోలేదు. కాని మీ రిమార్కుతో గూడా ఇతనిమీద పిటిషనులు చేరాయి. దీన్ని బట్టి ఈయన ఎంతవర్కు దిగజారాడో అర్థమవుతుంది. అని సూపర్లేటివ్ డిగ్రీలో కారాలు, మిరియాలు నూరారు కలెక్టరు ఆనంద్‌పై.

ఈ పిటిషనులోవి విషయాలు అభూత కల్పన సార్! యిది ఎవరో కిట్టనివాళ్లు చేసిన పని సార్! అంతేకాని పిటిషన్‌ని విషయాలు మాత్రం యదార్థంకాదు సార్! అని ఆనంద్ సంజాయిషి ఇవ్వడానికి ప్రయత్నించినా కలెక్టరుకు తిరిగి చెప్పడానికి ఆనంద్‌కి అవకాశం యివ్వలేదు. అంతేగాకుండా మంత్రిగారి యితరుల సమక్షంలో మాట్లాడడానికి ఆనంద్‌కు ధైర్యంకూడా చాలలేదు ఆ సమయంలో.

కలెక్టరుగారి ఇన్‌స్పెక్షన్ పూర్తయిన వారం రోజుల తర్వాత ఆనంద్‌ను 6 నెలలు సస్పెక్షన్ చేసినట్లు ఎంక్వయిరీ పూర్తయిన వెంటనే ఏజెన్సీకి ట్రాన్స్ఫర్ చేస్తున్నట్లు ఆర్డరు చేరింది కాలెక్టరాఫీసునుండి.

ఆనంద్‌కు తర్వాత తెలిసింది. ఇదంతా తన అనునాయులకి తప్పుడు సర్టిఫికెటు యివ్వలేదన్న ఉక్రోషంతో మంత్రిగారే వాళ్ళ అనునాయులుతో పెట్టించిన అబద్ధపు కల్పిత పెటిషనని-

కాని ఆనంద్ ఎంత నీతి. నిజాయితీగా పనిచేసినా మంత్రిగారి అభీష్టానికి వ్యతిరేకం కావడంచేత, ఆనంద్ తాలూకు నీతి, నిజాయితీలను గుర్తించి, సమర్ధించడానికి కనీసం ఒక వ్యక్తి అయినా ధైర్యంగా ముందుకు రాలేదు.

చివరకు ఆనంద్‌కు చేసేది ఏమీ కనబడలేదు. పాపం కలెక్టరు చర్యకు బలి అవడం తప్ప!

★